

అమ్మానాన్నలు పర్యవేక్షణ అవసరం

● విద్యార్థుల ప్రవర్తనపై విద్యావేత్తల అభిప్రాయం
● నేడు పాఠశాలల్లో 'మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్' ● విద్యార్థుల క్రమశిక్షణపై చర్చ అవసరం



అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఒక ఉన్నత పాఠశాలలో టీచర్ హఠాన్మరణానికి అక్కడి 9వ తరగతి విద్యార్థులు కారణమయ్యారు.ఘర్షణ పడొద్దంటూ మందలించిన టీచరుపై విద్యార్థులు తిరగబడ్డ ఘటనతో ఉపాధ్యాయ లోకం ఉలిక్కిపడింది.ఇలాంటి ఘటనల్ని హెచ్చరికలుగా భావించి తమ పిల్లల ప్రవర్తన తీరును ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పర్యవేక్షించి తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందంటోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఒకప్పుడు ఉపాధ్యాయుడు దండించాడని తెలిస్తే తల్లిదండ్రులు పిల్లలను గాడిలో పెట్టేందుకే అలా చేశాడని విశ్వసించేశారు. ఎంత అల్లరి పిల్లలైనా గురువు ఎదుట క్రమశిక్షణగా మెలిగేవారు. కాలం మారేకొద్దీ విద్యార్థుల, తల్లిదండ్రుల ఆలోచనా దృక్పథాలు మారాయి.తప్పు చేసినప్పుడు విద్యార్థిని గురువు దండిస్తే మమ్మల్ని ప్రశ్నించడానికి నువ్వెవరు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. వారి తల్లిదండ్రులేమో ఏకంగా పాఠశాలల వద్దకు వెళ్లి గొడవ పడుతున్నారు.విద్యార్థులు సైతం మద్యం, గంజాయి వ్యసనాలతో విచక్షణ కోల్పోతున్నారు.విద్యార్థుల్లో నేర ప్రవృత్తిని పెంచడంలో సినిమాలు, సీరియళ్లు,సోషల్ మీడియా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.పిల్లల్లో ఇటువంటి ధోరణుల్ని మొదటే గుర్తించి నేర్పుగా దారిలోకి తీసుకురావాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

● నేడు కౌన్సెలింగ్‌కు మంచి వేదిక

కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో శనివారం 'మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ పేరిట పెద్దపండుగను నిర్వహిస్తోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశంలో పాల్గొంటారు.విద్యార్థుల ప్రతిభతో పాటు అలవాట్లు, గుణగణాలపై చర్చించనున్నారు. సమావేశం అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేయనున్నారు. పిల్లల అలవాట్లు, తీరు గురించి ఈ సమావేశంలో తల్లిదండ్రుల దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లి పరిస్థితిలో మార్పు తేవాల్సిన అవసరముంది.

ఇక్కడా పలు ఘటనలు

●మన జిల్లాలోనూ ఆకతాయి, జులాయి పిల్లలున్నారు. పూతలపట్టు నియోజకవర్గంలోని ఓ హైస్కూల్‌లో జరిగిన వార్షికోత్సవంలో కొంతమంది విద్యార్థులు విచ్చలవిడిగా ప్రవర్తించడాన్ని ప్రశ్నించిన టీచర్లపై తిరగబడ్డారు.తీరా పరిశీలించి చూస్తే మద్యం సేవించి వచ్చినట్లు టీచర్లకు అర్థమైంది. దీంతో తల్లిదండ్రుల్ని పిలిపించి విషయాలను వివరించినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. దీంతో ఓ విద్యార్థికి బలవంతంగా టీసీ ఇచ్చి పంపించడంతో పాటు పోలీసు కౌన్సెలింగ్ కూడా ఇప్పించారు. ● పలమనేరు నియోజకవర్గంలోని ఓ ఉన్నత పాఠశాలలో మహిళా టీచర్ గురించి తరగతి గదులు, మరుగుదొడ్ల గోడలపైన విద్యార్థులు అసభ్యంగా రాయడంతో ఆమె తీవ్ర మానసిక క్షోభకు గురైంది. అవమానంతో దీర్ఘకాలిక సెలవు కూడా పెట్టింది. విద్యార్థులే అలా రాశారని తెలిసినప్పటికీ వారిని ఏమీ చేయలేని స్థితిలో అక్కడి ఉపాధ్యాయులు ఉండిపోయారు. ● నగరి నియోజకవర్గంలోని ఓ హైస్కూల్‌లో విద్యార్థి ప్రభుత్వం తనకిచ్చిన ట్యాబులో అశ్లీల చిత్రాలు చూస్తున్నాడని టీచర్ మందలించారు. దీన్ని అవమానంగా భావించిన ఆ విద్యార్థి ఏకంగా ఆ టీచర్‌నే టీజింగ్ చేయడానికి కూడా వెనుకాడలేదు.

తల్లిదండ్రులనుంచే మార్పు రావాలి



టీచర్లు దండించకూడదని న్యాయస్థానం ఆదేశాలిచ్చినప్పటి నుంచి వ్యవస్థ గాడి తప్పింది. దీన్ని అదునుగా చూసుకుని, కొట్టడం పక్కనపెడితే.. హెచ్చరించినా.. తల్లిదండ్రులు టీచర్ల మీద దాడికి వచ్చేస్తున్నారు. మార్పు టీచర్ల నుంచి కాదు.. తల్లిదండ్రుల నుంచే రావాలి. తల్లిదండ్రులు గారాబంతో పిల్లలకు సెల్‌ఫోన్లు కొనిస్తున్నారు. సోషల్ మీడియా, సినిమాలు, సీరియళ్లతోనే బిడ్డలు చెడిపోతున్నారు.

- రాధాకుమారి, టీచర్, చెర్లోపల్లె ,చిత్తూరు రూరల్ మండలం

టీచర్లకు స్వేచ్ఛ లేకపోవడంతోనే



విద్యార్థులకు తల్లిదండ్రుల నుంచి స్వేచ్ఛ ఎక్కువగా ఉండడం.. సమాజం పట్ల విలువలు నేర్చే క్రమంలో టీచర్లు దండిస్తే తల్లిదండ్రులు గొడవ పడడం.. వంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో విద్యార్థిని తీర్చిదిద్దే స్వేచ్ఛ ఉపాధ్యాయులకు లేకుండా పోయింది. ఈక్రమంలో విద్యార్థులు పక్కదారి పడుతున్నారు. భవిష్యత్తును అంధకారంగా మలచుకుంటున్నారు.తల్లిదండ్రులు.. పిల్లలకు విలువలు, బాధ్యతలు నేర్పించాలి. ఉపాధ్యాయులకు తమ పిల్లల్ని తీర్చిదిద్దే స్వేచ్ఛనివ్వాలి.

-హేమచంద్రారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్వేటినగరం

సానుకూల సంభాషణలతో మార్చాలి



యవ్వనంలో మానసిక, శారీరక మార్పులు వేగంగా జరుగుతాయి. ఈ దశలో కొంతమంది పిల్లలు ఆవేశపూరిత ప్రవర్తనను, చట్టవ్యతిరేక ధోరణులను ప్రదర్శిస్తుంటారు. ఇలాంటి పిల్లలతో తల్లిదండ్రులు క్రమం తప్పకుండా మాట్లాడుతూ స్నేహంగా మెలగాలి. వారి అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి ప్రోత్సహించాలి.ప్రవర్తనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు ఆదర్శంగా నిలవాలి.

- డాక్టర్ జయప్రియ, సైక్రియాటిస్ట్, అపోలో ఆస్పత్రి,చిత్తూరు

31రెవిన్యూ గ్రామాల్లో సదస్సులు

అందిన దరఖాస్తులు 1087

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూవివాదాలను తగ్గించడమే లక్ష్యంగా శుక్రవారం నుంచి రెవిన్యూ సదస్సులు పండుగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు పాలసముద్రం తప్ప మిగిలిన 31 రెవిన్యూ మండలాల్లో జరిగిన సదస్సులకు భూబాధితులు విశేషంగా తరలివచ్చారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలను అర్జీల రూపంలో అందజేశారు. తొలిరోజు సదస్సులకు 1087 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. రామకుప్పం మండలం గొరివిమాకులపల్లెలో కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొని రెవిన్యూ సదస్సును ప్రారంభించగా, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పాల్గొన్నారు. జేసీ విద్యాధరి యాదమరి మండలం కుక్కలపల్లె సదస్సులో పాల్గొనగా, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వి.కోట మండలం గోనుమాకులపల్లెలో, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఆర్డీవో భవాని బైరెడ్డిపల్లె మండలం బేలుపల్లి సదస్సులో పాల్గొన్నారు. గుడిపాల మండలం నారగల్లులో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొనగా పలుచోట్ల జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. మండల తహసీల్దార్లు, సర్వేయర్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, దేవదాయ, అటవీశాఖ బృందాలు సదస్సుల్లో పాల్గొన్నాయి. సదస్సులకు ప్రత్యేక పర్యవేక్షణ అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంఎం నాయక్‌ను ప్రభుత్వం నియమించింది.సదస్సుల నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రభుత్వానికి చివరన నివేదిక ఇస్తారు.

సదస్సుల కారణంగా ఆగిన రిజిస్ట్రేషన్లు

రెవిన్యూ సదస్సుల్లో విధిగా రిజిస్ట్రేషన్ అధికారులు పాల్గొనాలని అధికారులు ఆదేశించారు.దీంతో జిల్లావ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్లు సదస్సులకు వెళ్ళడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన క్రయవిక్రయదారులు అసంతృప్తితో వెనుదిరిగి వెళ్ళారు.శనివారం అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో బడిపండుగ నిర్వహిస్తున్న నేపథ్యంలో రెవిన్యూ సదస్సులు జరగవని అధికారులు తెలిపారు.

ఈ సమస్యలే అధికం

రెవిన్యూ రికార్డుల్లో భూహక్కుదారుల పేర్లమార్పు, పట్టాదారు పేర్లలో తప్పులుంటే సవరించడం, 22ఏ నిషేధిత భూముల జాబితాలో తొలగింపులు, సర్వే సంఖ్యలు, సబ్‌డివిజన్లలో తప్పుల సవరణ,ప్రభుత్వ భూముల సవరణ,ప్రభుత్వ భూము ల్లో ఆక్రమణల తొలగింపు అంశాలపై సదస్సుల్లో ఎక్కువగా అర్జీలు అందాయి.భూఆక్రమణకు సం బంధించి 8అర్జీలు, 22ఏకి సంబంధించి భూముల తప్పులపై 20 అర్జీలు, ఇతరత్రా అర్జీలపై 1059 వెరసి 1087 అర్జీలందాయి. 156.29 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయంటూ అర్జీదారులిచ్చిన ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. అందిన ఫిర్యాదుల్లో కొన్నింటిని అక్కడికక్కడే అధికారులు పరిష్కరించారు.



గొరివిమాకులపల్లెలో జరిగిన సదస్సులో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టరు సుమిత్‌కుమార్ తదితరులు


ప్రజల వద్దకే ప్రభుత్వం

రామకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గతంలో సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రభుత్వమే ప్రజల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తోందని కలెక్టరు సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండలం గొరివిమాకులపల్లెలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీహోల్డ్, మ్యుటేషన్, 22ఏ, డీకేటీ, రీసర్వే సమస్యలపై వినతులు ఇవ్వొచ్చన్నారు.అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించడం జరుగుతుందన్నారు. చట్టపరంగా ఉన్న సమస్యలు మాత్రం కోర్టుల ద్వారా పరిష్కారమవుతాయన్నారు.శాసనమండలి విప్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన తప్పుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూయజమానులకు న్యాయం చేసి, భరోసా ఇచ్చేందుకే కూటమి ప్రభుత్వం రెవిన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, కడ పీడీ వికాస్‌మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, తహసీల్దారు బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పంచాయతీగా బొమ్మసముద్రం



గ్రామ పంచాయతీ కార్యాలయం



బొమ్మసముద్రం

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఆరోగ్యకరమైన పంచాయతీగా ఐరాల మండలంలోని బొమ్మసముద్రం ఎన్నికైంది. గ్రామంలో 2023-24 సంవత్సరంలో అనారోగ్య మరణాలు లేక పోవడంతో పంచాయతీకి ఈ ఘనత దక్కింది. దీనివల్ల పంచాయతీకి అవార్డుతోపాటు రూ.కోటి నజరానా లభిస్తుంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన రూరల్ డెవలప్‌మెంట్ బృందం ఇక్కడకు విచ్చేసి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇక్కడ ఏఎన్ఎం సెంటర్ లేకపోయినా వైద్య సిబ్బంది అహర్నిశలు కృషిచేసి.. ప్రజలను ఆరోగ్యపరంగా ఉత్తేజవంతులను చేసినట్లు గుర్తించారు. పారిశుధ్యం చాలా బాగున్నట్లు, ఆహ్లాదరకంగా పంచాయతీ ఉన్నట్లు కేంద్రానికి నివేదికలు పంపారు. ఈ క్రమంలో ఈనెల 11వ తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును సర్పంచ్ రఘునాథ్, అప్పటి అధికారులు అందుకోనున్నారు. తమ పంచాయతీకి దేశ వ్యాప్తంగా గుర్తింపు రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల బాగోతం బట్టబయలు - మూడు నెట్ సెంటర్ల సీజ్

రామకుప్పం/కుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కేంద్రంగా నడుస్తున్న నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల బాగోతం బట్టబయలైంది. ఇటీవల కొందరు పంచాయతీ కార్యదర్శులు ఈ నకిలీ పత్రాలను గుర్తించి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌కు ఫిర్యాదు చేశారు.ఆయన ఆర్డీవో శ్రీనివాసరాజు దృష్టికి ఈ విషయాన్ని తేవడంతో గురువారం సాయంత్రం పలు నెట్ సెంటర్లలో తనిఖీలు జరిగాయి. రామకుప్పం మండలంలోని పలు నెట్ సెంటర్లలో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల తయారీ, పంపిణీ జరిగినట్లు తనిఖీల్లో గుర్తించామని ఆర్డీవో శ్రీనివాసరాజు,ఎంపీడీవో లక్ష్మీకాంత్ శుక్రవారం నాటి మీడియా సమావేశంలో తెలిపారు.రామకుప్పంతో పాటు మండలంలోని వీర్నమల, ముద్దనపల్లెల్లోని నెట్‌సెంటర్లలో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు తయారీ, విక్రయాలు జరిగినట్లు గుర్తించి వాటిని సీజ్ చేశామన్నారు.ఆర్డీవో కథనం మేరకు... రామకుప్పంలో నవీన్, వీర్నమలలో మాజీ వలంటీర్ బాలూనాయక్, ముద్దనపల్లెలో అక్రమ్ నెట్ సెంటర్లను నిర్వహిస్తున్నారు.మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తితో వాట్సాప్ ద్వారా బాలూనాయక్ పరిచయం పెంచుకుని డాష్‌బర్త్.ఇన్.నెట్ అనే వెబ్ పోర్టల్ యాక్సెస్ తీసుకున్నాడు. ఆ పోర్టల్ ద్వారా నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు తయారు చేసి విక్రయించేవాడు. ఇక్కడి వ్యక్తుల వివరాలను బాలూనాయక్ మధ్యప్రదేశ్‌కు పంపి నకిలీ పత్రాలను వెబ్‌పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేవాడు.ఒక్కో పత్రానికి రూ.200 చెల్లించే బాలూనాయక్ వాటికి రూ.1000 నుంచి రూ.1500 వసూలు చేసేవాడు. అనంతపురం జిల్లా కమలపాడు పంచాయతీ కార్యదర్శి, జగ్గంపేట మున్సిపాల్టీ పేరిట డిజిటల్ సంతకాలతో ధ్రువీకరణ పత్రాలు విక్రయించేవాడు.నవీన్, అక్రమ్, భాస్కర్, సీతారాం, మహేష్ ఓ ముఠాగా ఏర్పడి నకిలీ ధ్రువీకరణ పత్రాల దందా సాగిస్తున్నారు. అక్రమ్, భాస్కర్, సీతారాం నుంచి అప్లికేషన్లను నవీన్ తీసుకుని మహేష్‌కు పంపేవాడు. మహేష్ ఆ వివరాలతో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను తయారు చేసి నవీన్‌కు పంపేవాడు. శాంతిపురం మండలం రాళ్ళబూదుగూరు, కర్లగట్ట, రామకుప్పం పంచాయతీ కార్యదర్శుల లాగిన్లలో వారి డిజిటల్ సంతకాలతో ధ్రువీకరణ పత్రాలను అక్రమ్, భాస్కర్, సీతారాంలకు అందించేవాడు. అక్రమ్ ఆ ధ్రువీకరణ పత్రాలను బైరెడ్డిపల్లె, వాల్మీకిపురం తదితర ప్రాంతాల వారికి ఒక్కో ధ్రువీకరణ పత్రాన్ని రూ.1000 నుంచి రూ.1500 వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. నవంబరు 10 నుంచి ఈ దందా సాగుతోందని ఆర్డీవో తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి, భాస్కర్, సీతారాం ఎవరన్నది తెలియడం లేదన్నారు. నవీన్, బాలూనాయక్ ఇప్పటి వరకు 500 నుంచి 1000వరకు నకిలీ ధ్రువీకరణ పత్రాలు ప్రజలు అందజేసినట్లు తెలుస్తోందన్నారు.ఈ దందాపై శనివారం పంచాయతీ కార్యదర్శులు రామకుప్పం పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేస్తారన్నారు. ఈ నకిలీ ధ్రువీకరణ పత్రాలు ఒక రామకుప్పం మండలానికే పరిమితం కాలేదని, కుప్పం నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా కూడా సాగుతున్నట్టు అనుమానిస్తున్నామన్నారు. పోలీసుల విచారణలో అన్ని విషయాలు వెల్లడవుతాయని తెలిపారు. ప్రజలు తమకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాల్లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరాజు,ఎంపీడీవో లక్ష్మీకాంత్

యాదమరి సరిహద్దులో 14 ఏనుగుల గుంపు తిష్ఠ

యాదమరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదమరి- బంగారుపాళ్యం మండలాల సరిహద్దులో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. శుక్రవారం సాయంత్రం యాదమరి మండలం నుంజర్ల ప్రాజెక్టులో నీరు తాగడానికి 14 ఏనుగుల గుంపు వచ్చింది. ఈ గుంపు ఎటువైపొచ్చి రైతుల పొలాలపై దాడి చేస్తుందోనని రైతులు భయపడుతున్నారు. మరోవైపు ఈ ఏనుగుల గుంపును తాళ్లమడుగు అటవీప్రాంతం నుంచి తమిళనాడు అటవీప్రాంతానికి తరిమేందుకు ట్రాకర్లు ప్రయత్నిస్తున్నారు.

మద్యం మత్తులో తండ్రినే హతమార్చాడు

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కన్నకొడుకే తండ్రి పాలిట కాలయముడయ్యాడు. మద్యం మత్తులో బండరాయితో కొట్టి హతమార్చాడు.పులిచెర్ల పంచాయతీ సురేంద్రనగర్ కాలనీలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఇన్‌చార్జ్ సీఐ శ్రీధర్‌నాయుడు, కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. చెన్నై మక్కారంగా రైన్ కొళ్లత్తూరుకు చెందిన గోపాల్ (45)కు దేవి అనే మహిళతో వివాహమైంది. వీరికి ధనుష్ (23) అనే కుమారుడు జన్మించాడు. పుట్టిన ఏడాదిలోపే తల్లి దేవి మృతి చెందింది. ఐదేళ్ల అనంతరం అక్క కుమార్తె కళైవాణిని గోపాల్ రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు అశ్విని, పూజశ్రీ జన్మించారు. 9 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం గోపాల్ తన భార్య, ముగ్గురు పిల్లలతో సురేంద్రనగర్ కాలనీకి చేరుకొని డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఐదేళ్ల క్రితం కళైవాణి భర్తతో వచ్చిన మనస్పర్ధల కారణంగా పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది.గోపాల్, కుమారుడు ధనుష్ డ్రైవర్లుగా పని చేస్తూ ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. గోపాల్ ఇటీవల తన రెండవ భార్య వద్దకు వెళ్లి రావడం, కుమార్తెలతో ఫోన్‌లో మాట్లాడటం చేసేవాడు.అప్పుడప్పుడూ కొడుకుతో 'నీ వల్లే నా భార్య పిల్లలు నాకు దూరమయ్యారు' అని గొడవపడే వాడు. కువైట్ వెళ్లేందుకు రెండు ఇళ్లను అమ్మి నగదు ఇవ్వాలని తండ్రి గోపాల్‌తో కొన్నాళ్లుగా ధనుష్ గొడవపడేవాడు. అందుకు నిరాకరించిన నేపథ్యంలో గురువారం రాత్రి గోపాల్ తన ఇంటి సమీపంలోని బంధువుల ఇంటి వద్ద మద్యం సేవించి నిద్రపోయాడు.అర్ధరాత్రి దాటాక ధనుష్ తన తండ్రిని అక్కడి నుంచి ఇంటికి తీసుకొచ్చి హాల్లో పడుకోబెట్టాడు.కువైట్ వెళ్తానంటే సహకరించని తండ్రిపై అప్పటికే కోపంగా వున్న ధనుష్ మద్యం మత్తులో విచక్షణ కోల్పోయాడు. తన బాగోగులు చూసుకోలేని తండ్రిని హతమార్చాలని నిర్ణయించుకుని ఇంటి ముందున్న బండరాయిని తీసుకొచ్చి నిద్రిస్తున్న తండ్రి తలపై వేయడంతో గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని ధనుష్‌ను అదుపులోకి తీసుకున్నాడు.గోపాల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి రెండవ భార్య కళైవాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు గోపాల్ (ఫైల్ ఫొటో)

ముగిసిన తిరుచానూరు బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు శుక్రవారం మధ్యాహ్నం పంచమితీర్థం(చక్రస్నానం) భక్తజన ప్రవాహం నడుమ మంగళప్రదంగా జరిగింది. అమ్మవారు పుట్టిన తిథిగా భావించే కార్తీక మాసం శుక్లపక్ష పంచమి రోజున పద్మసరోవరంలో పంచమితీర్థ ఉత్సవం నిర్వహిస్తారు.ఈ సమయంలో పుష్కరిణిలో స్నానమాచరిస్తే మంచిజరుగుతుందనే నమ్మకంతో జనం పోటెత్తారు. అయితే తమిళనాడు నుంచి ఏటా భారీగా వచ్చే భక్తులు, ఈసారి వానల వల్ల కొంత తగ్గినట్లుగా కనిపించింది.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం : రాత్రి 9.30 నుంచి 11.00 గంటల మధ్య ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం రోజున ఎగురవేసిన గజపటాన్ని అవరోహణం చేశారు. ఉత్సవాల నిర్వహణకు ఆహ్వానించిన సకల దేవతలను, అష్టదిక్పాలకులకు బలినివేదన చేసి తిరిగి వారిని యథాస్థానానికి పంపించారు. ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకున్న పాంచరాత్ర ఆగమ పండితులు, అర్చకులను ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి ఆలయ మర్యాదలతో ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టారు.





శుక్రవారం వేకువజాము నుంచే పంచమి వేడుకలు తిరుచానూరులో మొదలయ్యాయి. పద్మావతీ అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాల అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు సన్నిధి ముఖమండపంలో చూర్ణాభిషేకం, ఆస్థానం నిర్వహించారు. అనంతరం అమ్మవారు, చక్రత్తాళ్వార్లను వేంచేపుగా పద్మసరోవరం పంచమీతీర్థ మండపంలో కొలువుదీర్చారు. సరిగ్గా10.35 గంటలకు తిరుమల నుంచి శ్రీవారు పంపిన సారె ఈ మండపానికి చేరుకుంది. అనంతరం ముత్తైదువ సారెతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అభిజిత్ లగ్నం శుభ గడియల్లో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు.ఇదే సమయంలో అశేష భక్త జనం 'శ్రీ పద్మావతీ పాహిమాం, గోవిందా... గోవింద' అంటూ పుష్కరిణిలో మునకలేశారు. కాగా పొద్దుపోయే వరకూ సుమారు లక్ష మంది వరకు పుణ్యస్నానాలు ఆచరించినట్లు టీటీడీ అంచనా.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

భక్తజనసాగరం

వేడుకగా పంచమీతీర్థం





పద్మావతికి 1.11 కోట్ల పుట్టినరోజు కానుకలు

పుట్టినరోజున పద్మావతమ్మకు శ్రీనివాసుడు ఈ ఏడాది వజ్రాభరణాలను కానుకగా పంపడం విశేషం. తిరుమల నుంచి పాండియన్ కిరీటం, వజ్రాల లక్ష్మీపతకం, హారం, గాజులు, జత కమ్మలు అందాయి. వీటి విలువ రూ.1.11 కోట్లు. ప్రతియేటా చక్రస్నానం రోజున శ్రీవారు ఆభరణాలను పంపించడం ఆనవాయితీ. వీటిని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు.







ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా ఇన్‌చార్జుల పాలన

● జిల్లాలో ఆరు కీలక పోస్టులు ఖాళీ

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా జిల్లా ప్రజారవాణా సంస్థలో ఆరు కీలక పోస్టులు ఖాళీ పడగా, ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోంది. గతంలో ఒకటి రెండు పోస్టులకు ఇన్‌చార్జి అధికారులను నియమించినా వారం వ్యవధిలో రెగ్యులర్ అధికారులను నియమించేవారు. ఏళ్ల తరబడి ఇన్‌చార్జీలతోనే సరిపెట్టేస్తుండటం గమనార్హం. రాష్ట్రంలోనే ఎక్కువ డిపోలు, అధిక ఉద్యోగులు, బస్సులు, మెజారిటీ ప్రయాణీకుల రవాణా, రాబడి కూడా ఎక్కువే. అధిక సంఖ్యలో వాణిజ్య దుకాణాలు, కార్గో ప్రధాన కేంద్రం ఇలా అన్ని విభాగాలలో జిల్లా మిన్నగానే ఉంటోంది. ఇన్‌చార్జ్‌ల పాలన విషయం విజయవాడ ప్రధాన కార్యాలయంలో తెలిసినా పట్టించుకోవడం లేదనే అసంతృప్తి అధికారుల్లో ఉంది. ప్రపంచ పుణ్యక్షేత్రం తిరుపతి కావడంతో ప్రజారవాణా సంస్థకు సంబంధించిన వ్యవహారాలు బిజీగానే ఉంటాయి. అలాగే తిరుమల ప్రోటోకాల్ పనులు కూడా తరచూ ఉంటాయి. ప్రత్యేక ఉత్సవాలు, పర్వదినాలు వంటి రోజుల్లో బస్సులు అదనంగా నడపాల్సి ఉంటుంది. ఇంత క్లిష్టంగా ఉండే తిరుపతి జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీ విభాగం ప్రధాన అధికారి నుంచి మరో ఐదు అధికారుల పోస్టులకు ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతుండటం కొసమెరుపు.

ఇంచార్జ్ పోస్టుల వివరాలు...

● డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(డీపీటీవో)గా ఉన్న సీనియర్ అధికారి టి.చెంగల్‌రెడ్డికి పదోన్నతి లభించడంతో గత అక్టోబరులో విజయవాడ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో చిత్తూరుజిల్లా డీపీటీవో జగదీష్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

● పర్సనల్ ఆఫీసర్(పీవో)గా పార్థసారథి గత మేనెలాఖరులో పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి చిత్తూరు పీవో సహజాద్‌కు పీవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

● తిరుపతి కమర్షియల్ ఏటీఎం సురేంద్రబాబు గత మేనెల్లో పదవీ విరమణ చేయగా, సీబీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

● చెన్నై అసిస్టెంట్ ట్రాఫిక్ మేజేజర్ల(ఏటీఎం) రెండేళ్ల క్రితం బదిలీలపై వెళ్లగా తిరుపతి సీబీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు అప్పటి నుంచి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈయనకు సీబీఎస్ ఏటీఎం విధులే అత్యంత కీలకం, క్లిష్టం. అయినా చెన్నై ఏటీఎంగా దాదాపు రెండేళ్ల నుంచి, తిరుపతి కమర్షియల్ ఏటీఎంగా గత జూన్ నెల నుంచి కొనసాగుతున్నారు.

● శ్రీకాళహస్తి డిపో మేనేజర్‌గా రాజవర్ధన్‌రెడ్డి గత సెప్టెంబరులో పదవీ విరమణ చేశారు. ఆ స్థానాన్ని తిరుపతి డీఎం బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

● తాజాగా గత శనివారం డిప్యూటీ సీటీఎం భాస్కర్ పదవీ విరమణ చేయగా ఆ ఖాళీని తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథంకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. జిల్లాలోనే అత్యంత కీలకమైన తిరుమలడిపో వ్యవహారాలను చక్కబెట్టడడం గగనం. అయితే డిప్యూటీ సీటీఎంగా ప్రధాన బాధ్యతల నిర్వర్తించడం పనిభారమే అవుతుంది. తిరుపతిలో మధ్యాహ్నం వరకు ఆపైన కొండకు వెళ్లాల్సివుంది.



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - వాసంశెట్టి సుభాష్ - స్మిత

ప్రసాదాల నాణ్యత పెరిగింది

తిరుమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గాయని స్మిత దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. తిరుమలలో అందరూ సమానమే భావన కనిపిస్తోందని మంత్రి సుభాష్ అన్నారు. ప్రసాదాల నాణ్యత కూడా బాగా పెరిగిందన్నారు. రాష్ట్రంలోని ఇతర ఆలయాల్లోనూ ప్రసాదాల రుచి పెరిగినట్లు చెప్పారు. ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉన్న ఏపీని గట్టెక్కించాలని, తెలుగు ప్రజలందరికీ ఆశీర్వాదాలు ఇవ్వాలని స్వామిని ప్రార్థించినట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు.

రిటైర్డు అదనపు ఎస్పీ జీవీ రమణ మృతి



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేసి అదనపు ఎస్పీగా ఉద్యోగ విరమణ పొందిన జీవీ రమణ శుక్రవారం మృతి చెందాడు. ఆయన తిరుపతిలోని పోస్టల్ కాలనీలో కాపురముంటున్నారు. రిటైర్డు అదనపు ఎస్పీలు అభిషేకం, దేవదానం, సాంబశివారెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసులు, రిటైర్డు డీఎస్పీలు గంగరాజు, పోతప్ప, నంజుండప్ప, రవిశంకర్ రెడ్డితో పాటు జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకుడు శంకర్ రెడ్డి తదితరులు రమణ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. శనివారం ఆయన అంత్యక్రియలు తిరుపతిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వేలిముద్ర వేయగానే ఖాతాలో నగదు మాయం

● ఇద్దరు యువకులపై కేసు

గూడూరు,డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయిస్తామన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలని నమ్మించారు. ఆధార్ డివైజ్‌తో వేలిముద్రలు తీసుకున్నారు. నగదూ వసూలు చేశారు. ఇక, వేలి ముద్ర వేయగానే కొందరి బ్యాంకు ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేసినట్లు మెసేజీలు వచ్చాయి. గూడూరు మండలంలోని రెడ్డిగుంటసంగంలో ఇలా జరగడంతో గ్రామస్తులు శుక్రవారం ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు తెలిపిన ప్రకారం.. సైదాపురం గ్రామానికి చెందిన గోపి, వెంకటేశ్వర్లు రెడ్డి గుంట సంగం గ్రామానికి వెళ్లారు.ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసమని ఆధార్ డివైజ్‌లో ఓ మహిళ వద్ద వేలిముద్ర వేయించారు.అంతే, కాసేపటికి ఆమె ఖాతాలో రూ.1000 నగదు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గోపి, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

హోంగార్డులు నైపుణ్యం పెంచుకోవాలి

రిజర్వు ఏఎస్పీ శ్రీనివాసరావు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికనుగుణంగా హోంగార్డులు వృత్తి నైపుణ్యతను పెంచుకోవాలని రిజర్వు జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. హోంగార్డుల 62వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండులో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందితో పోలిస్తే హోం గార్డులకు సౌకర్యాలు తక్కువగా ఉన్నా కొన్ని సందర్భాల్లో వారికంటే ఎక్కువ సేవ చేస్తున్నారన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు చిరంజీవి, పోతులురాజు, హోంగార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవంలో శ్రీనివాసరావు

తిరుమలలో మహారాష్ట్ర భక్తుడి ఆదృశ్యం



అనిల్ మార్ఖాకర్ (ఫైల్ ఫొటో)

తిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన మహారాష్ట్ర భక్తుడు కనిపించకుండా పోయినట్లు తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన అనిల్ మార్ఖాకర్(45) మరో 30 మందితో కూడిన భక్తబృందంతో గతనెల 29వ తేదీన తిరుమలకు వచ్చాడు. తలనీలాలు సమర్పించి ఉచిత క్యూ ద్వారా ఆలయంలోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి వచ్చే క్రమంలో ఆలయ మహద్వారం వద్ద రద్దీలో బృందం నుంచి విడిపోయాడు. వెంటనే బృందంలోని సభ్యులు అతని కోసం తిరుమల మొత్తం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో సొంతూరికి వెళ్లి చూశారు. అక్కడా లేకపోవడంతో ఆయన కుమారుడు రోహన్ శుక్రవారం తిరుమలకు చేరుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు తెలిసినవారు 94407 96769కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

త్వరలో భారీగా సీఐల బదిలీలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో భారీ ఎత్తున సీఐల బదిలీలు జరగనున్నాయి. తిరుపతి ఈస్ట్, తిరుమల టూటౌన్, తిరుపతి క్రైం స్టేషన్‌లో రెండు, భాకరాపేట సర్కిల్ కార్యాలయాల్లో రెగ్యులర్ సీఐలు లేరు. ఇక్కడ రెగ్యులర్ సీఐలను నియమిస్తూ భారీగా బదిలీలు జరగనున్నట్లు తెలిసింది. తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐని వీఆర్‌కు పంపిన అధికారులు.. ఇప్పటి వరకు ఇక్కడ రెగ్యులర్ సీఐని నియమించలేదు. ప్రస్తుతం తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక భాకరాపేట సీఐగా జిల్లా కేంద్రంలో సోషల్ మీడియాలో సీఐగా పనిచేస్తున్న ఇమ్రాన్‌బాషాను ఇన్‌చార్జిగా నియమించారు. తిరుమల టూ టౌన్‌కు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఉన్న శ్రీరాముడిని ఇన్‌చార్జిగా నియమించారు. వీరందరినీ పరిపాలనా సౌలభ్యం దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ అటాచ్‌మెంట్లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక తిరుపతిలో కీలకమైన క్రైం స్టేషన్‌లోనూ ఇద్దరు సీఐలు లేరు. డీఎస్పీనే చూసుకోవాల్సి వస్తోంది. ఇక, ఐదు నెలల కాలంలో పనితీరు, గంజాయి అక్రమ రవాణా, డ్రగ్స్ సరఫరా, పాత కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయడంలో విఫలమైన ఒకరిద్దరు సీఐలపై వేటు పడనున్నట్లు సమాచారం. వారి స్థానంలో సమర్థులను నియమించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. తూర్పు మండలాలకు చెందిన ఇద్దరు అధికారులకు స్థాన చలనం తప్పదనే ప్రచారం జరుగుతోంది.



హైకోర్టు ఉత్తర్వులను అధికారులకు అందజేస్తున్న సంఘమిత్రలు

ఆ సంఘమిత్రలను కొనసాగించండి

● తీర్పునిచ్చిన హైకోర్టు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విధుల నుంచి తొలగించిన ఐదుగురు సంఘమిత్రలను తిరిగి కొనసాగించాలంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ మేరకు సంఘమిత్రలు సీఐటీయూ నాయకులతో కలిసి వెలుగుశాఖ పీడీ శోభన్‌బాబుకి వినతిపత్రం సమర్పించారు. తొట్టంబేడు మండలంలోని పొయ్య, లింగమనాయుడుపల్లి, తాటిపర్తి, కొణతనేరి, కాసరం పంచాయతీల్లో పనిచేసే సంఘమిత్రలను ఇటీవల అధికారులు విధుల నుంచి తొలగించారు. దాంతో బాధితులు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారు. వారికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు సంఘమిత్రలుగా కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు సీఐటీయూ నాయకులు వెలుగుశాఖ పీడీని కలిసి కోర్టు ఉత్తర్వుల పత్రంతో పాటు తమ వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆర్డీవో రామ్మోహన్, చెన్నయ్య, చంద్రశేఖర్, బాలకొండయ్య పాల్గొన్నారు.

రైల్వే ఎన్నికల్లో..

చివరి రోజు 86 శాతం పోలింగ్

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లోని 34 పోలింగ్ కేంద్రాల్లో 86.16 శాతం ఓట్లు పోలయ్యాయి. చిత్తూరు, తిరుపతి, రేణిగుంట, పాకాల, శ్రీకాళహస్తి, వెంకటగిరి స్టేషన్లలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. డ్రైవర్లు, గార్డులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తిరుపతిలో 849, రేణిగుంటలో 825, శ్రీకాళహస్తిలో 132, వెంకటగిరిలో 143, చిత్తూరులో 164, పాకాలలో 327 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. బాక్స్‌లకు సీల్‌వేసి రేణిగుంట ఇన్‌స్టిట్యూట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు.

రోడ్ల నిర్మాణంతో గ్రామీణం కళకళ

ఉపాధి హామీ పథకంతో పంచాయతీరాజ్ పనులు అనుసంధానం

కుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ గుంతలు తేలి దీన స్థితిలో ఉన్న గ్రామాలు, ఇప్పుడు సిమెంటు రోడ్డు నిర్మాణాలతో కళకళలాడుతున్నాయి. ఉపాధి హామీ పథకంతో పంచాయతీరాజ్ పనులను అనుసంధానించిన ప్రభుత్వం, ఆ నిధులతో గ్రామగ్రామానా సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే 50 శాతం పైగా రోడ్ల నిర్మాణం పూర్తికాగా, మిగిలిన పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అంతేకాదు.. విజన్ డాక్యుమెంట్లో మరో రూ.138 కోట్లతో సిమెంటు రోడ్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి.



సంగనపల్లె పంచాయతీ చిన్నపర్తిగుంటలో వేసిన సిమెంటు రోడ్డు

ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో అయిదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి ఇసుమంత జరుగకపోగా, అంతకుముందు టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి కూడా ధ్వంసమైంది. ముఖ్యంగా పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లు లేని వీధులను వైసీపీ అలాగే వదిలివేయడంతో బురద గుంతలుగా మారిపోయాయి. పంచాయతీల నిధులను అడ్డదారిలో మళ్లించేసి పబ్బం గడిపిన జగన్ ప్రభుత్వం, గ్రామాలను అస్సలు పట్టించుకోకపోవడంతో ఈ రోడ్లు పూర్తిగా దుస్థితికి చేరుకున్నాయి. దీంతో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయగానే పంచాయతీలలో అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. సొంత నియోజకవర్గమైన కుప్పంనుంచే ఈ పనులను ప్రారంభించడానికి నిర్ణయించారు. నిధుల లేమితో కునారిల్లుతున్న పంచాయతీలలో ఏ అభివృద్ధి పని చేపట్టాలన్నా వీలుకాని పరిస్థితి. ఇటువంటి దుస్థితిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్కరకు వచ్చింది.ఉపాధి హామీ పథకంలో నిధులు పుష్కలంగా ఉన్నాయి. దీన్ని ఆసరాగా తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామాలలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంచాయతీరాజ్ అధికారుల ద్వారా తెప్పించుకున్నారు.ఈ ప్రతిపాదనలను ముందుపెట్టుకున్న ప్రభుత్వం కుప్పం నియోజవర్గంలోని నాలుగు మండలాలలో రూ.20.91 కోట్లతో మొత్తం 406 సిమెంటు కాంక్రీటు రోడ్ల పనులను మంజూరు చేసింది. నియోజకవర్గవ్యాప్తంగా 47 కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్ల నిర్మాణం ఈ నిధులతో సాధ్యమవుతోంది. ఈ నిధులలో కుప్పం మండలానికి రూ.701.50 లక్షలు, శాంతిపురానికి రూ.533 లక్షలు, రామకుప్పానికి రూ.474.60 లక్షలు, గుడుపల్లె మండలానికి రూ.382.70 లక్షలు కేటాయించారు. సెప్టెంబరు మొదటి వారంలో ప్రారంభమైన సిమెంటు రోడ్ల నిర్మాణం నవంబరు నెల ముగిసేసరికి 50 శాతం పూర్తయింది. మొత్తం 406 పనుల్లో సుమారు 200 పనులను పూర్తి చేశారు. దాదాపు 25 కిలోమీటర్ల మేర గ్రామాలలో సిమెంటు రోడ్లు నిర్మాణమయ్యాయి. డిసెంబరు నెలాఖరుకల్లా పనులన్నీ పూర్తి చేయాలని లక్ష్యం విధించుకున్నట్లు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ గురవారెడ్డి తెలిపారు.



కంగుంది పంచాయతీ గిడ్డేగానిపెంట గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణం

137 కోట్లతో ప్రతిపాదనలు

కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై విజన్ డాక్యుమెంటు రూపొందింది. కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులూ, ఈ డాక్యుమెంట్లో తమ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలు రూపొందించి సమర్పించారు. అలా కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో రూ.137.95 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు డాక్యుమెంట్లో చోటు చేసుకున్నాయి. ఈ అంచనా వ్యయంతో మొత్తం 2,74,584 మీటర్ల మేర ఏకంగా 2436 సిమెంటు కాంక్రీటు రోడ్ల నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అలాగే పంచాయతీ శాఖ పరిధిలో రూ.21.90 కోట్ల అంచనాతో 46 భవనాలు, రూ.262.3 కోట్లతో 233.10 కిలోమీటర్ల పొడవున 139 బీటీ రోడ్లు, రూ.4.71 కోట్లతో 45 అసంపూర్తి భవనా నిర్మాణం వంటి అభివృద్ధి పనుల ప్రతిపాదనలు కూడా విజన్ డాక్యుమెంట్లో చోటు చేసుకున్నాయి. ఇప్పటికే ఈ ప్రతిపాదనలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు చేరాయి. ఇక ప్రభుత్వ ఆమోదం పొందడమే తరువాయి. కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తయారు చేయాలన్నది ముఖ్యమంత్రి సంకల్పం. ఈ సంకల్పం నేపథ్యంలో విజన్ డాక్యుమెంట్ త్వరలోనే కార్యరూపం దాల్చుతుందన్నది నియోజకవర్గ ప్రజల నమ్మకం.

జాతీయ స్థాయిలో విజయం సాధించండి

● ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



ఈఈ సురేష్‌ను సన్మానిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఇటీవల జరిగిన విద్యుత్ శాఖ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో జిల్లాకు చెందిన ఉద్యోగులు ప్రతిభ చూపారని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ సురేష్, ఇతర ఉద్యోగులను శుక్రవారం స్థానిక గిరింపేటలో ఎస్ఈ కార్యాలయంలో అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి సహకరించండి

నూతన ఈవో పెంచల కిషోర్



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని నూతన ఈవో పెంచల కిషోర్ కోరారు. శుక్రవారం ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో మాట్లాడుతూ తనకు ఆలయం గురించి తెలుసునన్నారు. ఉభయదారులతో తనకు మంచి అనుబంధం ఉందని చెప్పారు. ఉభయదారులు, స్థానికుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలియజేశారు. అనంతరం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ను చిత్తూరులోని ఆయన నివాసంలో కలిసి.. ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన గురుప్రసాద్.. కర్నూలు డీసీగా వెళ్లారు.

బాల్య వివాహాలతో అనర్థాలు : జేసీ



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల కారణంగా జరిగే అనర్థాలు తప్పవని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో టీనేజ్ ప్రెగ్నెన్సీ అంశంపై వైద్యాధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ, ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడీల సమన్వయంతో విస్తృతంగా అవగాహన కల్పిస్తే బాల్య వివాహాలు తగ్గే అవకాశం ఉందన్నారు. చిన్న వయస్సులోనే గర్భధారణ 2057 మందిలో జరగ్గా.. అందులో కుప్పం, పలమనేరులోనే ఎక్కువగా ఉందని తెలిపారు. డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, ఐసీడీఎస్ పీడీ హైమావతి, సోషియల్ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

1,500 గ్రాముల గంజాయి పట్టివేత

ముగ్గురు యువకుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

నగరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని సెత్తంకం డ్రిగ గ్రామ సమీపాన ఉన్న తచ్చూరు-చిత్తూరు హైవే రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1500 గ్రాముల గంజాయిని, ఓ బైక్‌ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో తిరుత్తణికి చెందిన రాజేంద్రప్రసాద్(25), నగరి మండలం ఓజీకుప్పంకు చెందిన సతీష్(33), తులసీధర్(32) ఉన్నారు. వీరిని నగరి జూనియర్ మెజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం హాజరుపరిచినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. ఓజీకుప్పానికి చెందిన యువకులు తిరుత్తణి యువకుడికి గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

● ఎస్పీ మణికంఠ



హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ - హోంగార్డుల ర్యాలీ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెడతానని ఎస్పీ మణికంఠ అన్నారు. శుక్రవారం హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పరేడ్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై.. హోంగార్డుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 362 మంది హోంగార్డులు ఉన్నారని, వీరితోపాటు 137 మంది వివిధ శాఖల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో, వీవీఐపీల పర్యటనలో, నేరాల నియంత్రణలో ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. హోంగార్డు బెనిఫిట్ ఫండ్ ఏర్పాటు చేసి గాయపడిన, మరణించిన, రిటైర్‌మెంట్ సమయంలో ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. అనంతరం స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలైన వారికి బహుమతులను అందించి, 2024లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లను అందించారు. ఆపరేషన్ ఏఎస్పీ రాజశేఖర్ రాజు, ఎస్బీ సీఐలు భాస్కర్, మనోహర్, ఎంటీవో భాస్కర్, హోంగార్డు ఆర్ఐ చంద్రశేఖర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంగుంటలోని రెండిళ్లలో చోరీ

10 గ్రాముల బంగారం, రూ.20వేల అపహరణ



ఓ ఇంట్లో దొంగలు తెరిచిన బీరువా

శ్రీరంగరాజపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ పురం మండలంలోని మంగుంటలో రెండిళ్లలో చోరీలు జరిగాయి. నగదు, బంగారు నగలు దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో శుక్రవారం పట్టపగలే గుర్తు తెలియని దుండగులు భువనేశ్వరి ఇంట్లో 10గ్రాములు బంగారం చోరీ చేశారు. చంద్రబాబు రెడ్డి ఇంట్లో రూ.20వేలను ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన సమయంలో భువనేశ్వరి, చంద్రబాబులు తమ ఇళ్లకు తాళాలు వేసి, పొలం వద్ద ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. కాగా, మరో రెండిళ్లలోనూ చోరీకి యత్నించినట్లు స్థానికులు తెలిపారు. గత నెలల్లో ఓడ్డుపల్లె గ్రామంలో ఓ టీచర్ ఇంట్లో చోరీకి యత్నించారు. అదేరోజున గంగమ్మగుడిలో హుండీ ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఇకనైనా పటిష్ట నిఘా పెట్టి, ఈ చోరీలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

విజయసాయి రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2028లో ఎన్నికలు జరుగుతాయని, వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పటివరకు చంద్రబాబు బతికుంటే అరెస్టు చేస్తామని విజయసాయి రెడ్డి చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను ప్రభుత్వం, డీజీపీ తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఆయన మాటలు వింటుంటే సీఎంపై ఏదో కుట్ర జరుగుతోందనే అనుమానం వస్తోందని తెలిపారు. ఆయన మాటలపై సమగ్ర దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం



సీఆర్ రాజన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా టీడీపీ చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ ప్రమాణస్వీకారం చేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన్ను టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేతలు చంద్రప్రకాష్, మోహన్‌రాజ్, రాజశేఖర్, సునీల్ కుమార్, గురజాల సుధాకర్ నాయుడు, ధనంజయ నాయుడు, శ్రీధర్ యాదవ్, త్రిమూర్తి, ధరణి ప్రకాష్, శంకర్, విజయ్‌కుమార్, గోపాల్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

11 కార్ల చోరీ.. నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐలు - పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

గంగవరం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే కార్ల చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 11 కార్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం గంగవరం పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ ప్రభాకర్ వివరాలు వెల్లడించారు. పలమనేరులోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన సుబ్బన్న జోయాల్(24) యాక్టింగ్ కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. గిరాకీలు పెరగడంతో స్వయంగా ట్రావెల్స్ నడపాలని నిశ్చయించుకున్నాడు. పరిచయం ఉన్న కొంతమంది కార్ల యజమాన్లతో మాట్లాడి ట్రావెల్స్‌కు 11 కార్లు అద్దెకు తీసుకున్నాడు. కొంతకాలం వ్యాపారం బాగాజరిగింది. తర్వాత ఒక్కసారిగా వ్యాపారం తగ్గిపోయింది. కార్ల యజమానులు డబ్బుల కోసం తరచూ ప్రశ్నిస్తుండడంతో 6 కార్లను యజమానులకు అప్పగించేశాడు. వాటికి సంబంధించిన డూప్లికేట్ తాళాలను తన వద్దే ఉంచుకున్నాడు. రోజురోజుకూ ఒత్తిడికి పెరగడంతో మరో 5 కార్లను కుదవపెట్టేశాడు. వచ్చిన డబ్బుతో జల్సాలుచేసేవాడు. కార్ల యజమానులు అడిగిన ప్రతిసారీ ఈరోజు, రేపు అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడు. చివరికి ఏంచేయాలో తెలియక తన వద్దనున్న డూప్లికేట్ తాళాలతో మొదట అప్పగించిన కార్లను దొంగలించి పలుచోట్ల కొదవపెట్టేశాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో శుక్రవారం పలమనేరు - బెంగళూరు రహదారిలో నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద ఉండగా నిందితుడిని అరెస్టుచేశారు. అతడి నుంచి రూ.60 లక్షల విలువైన 11 కార్లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు తరలించారు. ఈ కేసును ఛేదించడానికి కృషిచేసిన పలమనేరు అర్బన్, రూరల్ సీఐలు నరసింహరాజు, ప్రసాద్‌లను డీఎస్పీ అభినందించారు. రివార్డులకు సిఫార్సు చేశారు.

పట్టాలెక్కనున్న యాభైయేళ్ల కల

● అత్తిపట్టు- పుత్తూరు రైల్వేలైన్‌కు నిధులు మంజూరు



'తూర్పు' ప్రాంతానికి రైలు కూత పెట్టనుంది. ఈ ప్రాంత ప్రజల ఐదు దశాబ్దాల కల త్వరలో పట్టాలెక్కనుంది. పుత్తూరు నుంచి నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా చెన్నై అత్తిపట్టు వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కోసం ఎట్టకేలకు రైల్వేశాఖ అనుమతిచ్చింది. రైల్వేశాఖ తీసుకున్న ఈ నిర్ణయంతో సత్యవేడు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సత్యవేడు, ఆంధ్రజ్యోతి

పుత్తూరు నుంచి సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా తమిళనాడులోని చెన్నై హార్బర్ వరకు నిర్మించ తలపెట్టిన అత్తిపట్టు- వేపగుంట రైల్వేలైన్ నిర్మాణం అయిదు దశాబ్దాలుగా ప్రతిపాదన దశలోనే ఉంది. 1970లో అప్పటి కేంద్ర ప్రభుత్వం అత్తిపట్టు నుంచి పుత్తూరులోని వేపగుంట వరకు కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేసింది. 88 కిలో మీటర్లున్న ఈ రైల్వేలైన్ నిర్మాణం తమిళనాడు(చెన్నై)లోని అత్తిపట్టు రైల్వేస్టేషన్ నుంచి మొదలై పెరియపాళెం, పాలవాక్కం, ఊత్తుకోట మీదుగ రాష్ట్రంలోని నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, వేపగుంట మీదుగా పుత్తూరు వరకు ఎనిమిది రైల్వే స్టేషన్‌లను నిర్మించాల్సి ఉంది. అందుకు 189 హెక్టార్ల భూమిని సేకరించాలని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు అప్పట్లో ప్రతిపాదనలు సిద్ధంచేశారు. అప్పటి నుంచి బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడంతో దశాబ్దాలుగా కార్యరూపం దాల్చడంలేదు. అయితే 2012-2013 ఆర్థిక సంవత్సరంలో ఈ రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణ పనులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో సదరన్ రైల్వే అధికారులు అప్పటి జిల్లా కలెక్టర్ సాల్మన్ ఆరోగ్యరాజ్‌ను కలిసి భూసేకరణకు సహకరించాలని కోరారు. రైల్వే మ్యాప్‌ను పరిశీలించిన అప్పటి కలెక్టర్.. భూసేకరణ చేసి రైల్వే అధికారులకు అప్పజెప్పాలని నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం తహసీల్దార్లను ఆదేశించారు. భూసేకరణకు ప్రత్యేకాధికారిగా అప్పటి జేసీ వినయ్‌చంద్ పర్యవేక్షణలో భూసేకరణకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి అందించారు. అయితే, అప్పటి బడ్జెట్‌లో కూడా కేంద్రం నిధులు కేటాయించలేదు. దీంతో ఈ ప్రాంతంలో రైల్వే లైన్ ఏర్పాటు కానుందని సంబరపడిన నియోజకవర్గ ప్రజలకు మళ్లీ నిరాశే మిగిలింది. ఇలా ప్రతిసారీ బడ్జెట్‌లో అత్తిపట్టు - పుత్తూరు రైల్వేకూత వినబడుతుందని ఆశగా ఎదురుచూడ్డం, నిరాశచెందడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెన్నై రైల్వేజోన్‌లో పుత్తూరు- అత్తిపట్టు రైల్వేలైన్ భూసేకరణకు రైల్వేశాఖ అనుమతిచ్చింది. దీంతో మళ్లీ నియోజకవర్గ ప్రజలకుఆశలు చిగురుస్తున్నాయి. ఈ రైల్వేలైన్ నిర్మాణం రూపుదాల్చితే సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లోని పలు మండలాల ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు వ్యాపారాభివృద్ధి గణనీయంగా పెరగనుంది.

మద్యం మత్తులో వాహనాలు నడిపిన 10మందికి రూ.లక్ష జరిమానా

పుంగనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పుంగనూరు వద్ద మద్యం మత్తులో వాహనాలు నడిపిన 10 మందికి రూ.10వేలు చొప్పున కోర్టు రూ.లక్ష జరిమానా విధించింది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. స్థానిక డాన్‌బాస్కో స్కూల్ ప్రాంతంలో పోలీసులు గురువారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. 10 మంది ద్విచక్రవాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసి పుంగనూరు కోర్టులో ఇన్‌చార్జి జడ్జి శ్రీనివాసులు ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి వారికి జరిమానా విధించారు.

16లోపు ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించకపోతే జైలు

మద్యం వ్యాపారుల కేసులో కోర్టు తీర్పు

పలమనేరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీకి బకాయి ఉన్న ట్రేడ్ లైసెన్సుల ఫీజును జరిమానాతో పాటు ఈనెల 16లోపు చెల్లించకపోతే నెలరోజుల జైలుశిక్ష విధిస్తామని శుక్రవారం కోర్టు తీర్పు ఇచ్చిందని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. 2012-13 సంవత్సరంలో పలమనేరుకు చెందిన అప్పటి మద్యం వ్యాపారులు యం.గోవిందు, పి.మున స్వామి, సి.క్రిష్ణమూర్తి, ఈ.మునిరత్నం, ఎం.నారాయణలను మున్సిపల్ అధి కారులు ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించాలని కోరగా వారు చెల్లించలేదు. దీంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు వీరిపై కోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం ట్రేడ్ లైసెన్సు నగదు చెల్లించని ఐదుగురు ఒక్కొక్కరు జరిమానాతో కలిపి రూ.63,500లు ఈనెల 16వ తేదీ లోపు చెల్లించాలని లేనిపక్షంలో జైలు శిక్ష విధిస్తామని న్యాయమూర్తి రాధమ్మ శుక్రవారం తీర్పునిచ్చారని వివరించారు.

అంబేడ్కర్‌కు కలెక్టర్ నివాళులు



రామకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కలెక్టరు సుమిత్‌కుమార్ శుక్రవారం రామకుప్పం మండలం గౌరివిమాకులపల్లెలో నిర్వహించిన రెవిన్యూ సదస్సుల్లో పాల్గొన్నారు. అంబేడ్కర్ వర్థంతిని పురస్కరించుకుని అక్కడి వేదిక వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూజలు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కడ పీడీ వికాస్‌మర్మత్, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, తహసీల్దారు బాబు, టీడీపీ నేతలు మునస్వామి, పట్రా నారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు, చిన్నకృష్ణ, చలపతి, మహ్మద్‌రఫీ, కృష్ణానాయక్, గంట్లప్పగౌడు పాల్గొన్నారు.

జాతీయ గ్రీన్ లిటరేచర్ ఫెస్టివల్‌కి నీలకంఠకు ఆహ్వానం



తిరుపతి(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రీన్ లిటరేచర్ ఫెస్టివల్‌కు కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయాలజీ టీచర్ నీలకంఠం ఎంపికయ్యారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ జాతీయ స్థాయి సదస్సు బెంగళూరులో శనివారం జరుగనుంది. ఈ అంశంపై అనేక రచనలు చేసిన నీలకంఠకు ఆహ్వానం లభించింది. ఆయన నేషనల్ గ్రీన్‌కోర్ స్టేట్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి


నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. పలమనేరు లోని మదనపల్లి సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తెలుగుదేశం, సీపీఎం, వైసీపీ నాయకులు, ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు పుష్పరాజ్, జయ రాం, నాగయ్య తదితరులు పూల మాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ వెంకటేసులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు


మాట్లాడుతున్న తహసీల్దార్ ఇన్బనాథన్

పలమనేరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని పలమనేరు తహసీల్దార్ ఇన్బనాథన్ పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరు మండలం జగమర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 14 అర్జీలు వచ్చాయి. ఇందులో జగమర్ల అటవీ ప్రాంతంలో ఉన్న పురాతన ఆలయ సమీపం లో ప్రైవేటు వ్యక్తులకు గతంలో ఇచ్చిన భూమిని ఆలయానికి ఇప్పించాలని, జగమర్ల గ్రామంలో నిర్మించిన సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు ప్రారంభంలో ఉన్నదారినే ఏర్పాటుచేయాలని విన్నవించారు. మిగిలిన 12 అర్జీలు వ్యక్తిగత రెవెన్యూ సమస్యలపై ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్, అటవీ శాఖ, ఎండోమెంట్, సబ్ రిజిస్ట్రార్ శాఖల కు చెందిన అధికారులు, సర్పంచ్ విజయ్ కుమార్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

కుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అం బేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని కుప్పం టీడీపీ కార్యాలయంలో, ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. ఎమ్మె ల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మ న్ పీఎస్‌మునిరత్నం, పార్టీ మున్సిపల్ అధ్య క్షుడు రాజ్‌కుమార్‌లు పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి, ఆర్టీసీ బస్టాండులో అంబేడ్కర్ విగ్రహానికి పూజలు చేశారు. అ దేవిధంగా జనసేన కార్యాలయంలో నియోజ కవర్గ ఇన్‌చార్జి డా.నరేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేశారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన మాజీ సర్పంచ్

సోమల, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట సమీపంలోని తిరుపతి - పుంగనూరు ప్రధాన రహదారిలో రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా ఉండేది. ఇరికిపెంట మాజీ సర్పంచు శ్రీనివాసులునాయుడు గ్రామస్తులతో కలిసి చెన్నపట్నం చెరువు మలుపు వద్ద, దెబ్బతిన్న కల్వర్టు వద్ద రోడ్డుపై ఉన్న గుంతలను కంకర వేసి గుంతలను పూడ్చారు. పలువురు అభినందించారు.

అంబేడ్కర్‌కు పలుచోట్ల ఘన నివాళి


శాంతిపురం, పెద్దపంజాణిలో అంబేడ్కర్‌కు నివాళులు

శాంతిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని మండలంలో అధి కారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూజలు చేశారు. మండల సచివాలయం ఎదుట ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. శివరామాపురంలో మహిళా నేతలు, రాళ్లబూదుగూరు, కనమలదొడ్డి, కర్లగట్ట, అన్ని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర గ్రామాలలో అంబేడ్కర్ చిత్రం పటానికి పూజలు చేసి నివాళర్పించారు.

రామకుప్పం: రామకుప్పంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వివిధ రాజకీయపార్టీలు, దళిత సంఘాల నాయకులు స్థానిక పోలీస్ స్టేషను సర్కిల్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూ జలు చేసి, ఘనంగా నివాళులర్పించారు. టీడీ పీ నాయకులు మునస్వామి, పత్రనారాయణా చారి, చలపతి, చిన్నికృష్ణ, ఆనందరెడ్డి, నరసిం హులు, సీతాపతి, రామ్మూర్తి, జయశంకర్, న వీన్, బాలరాజు, రామలింగారెడ్డి, బాలరాజు, కామరాజనాయక్, బీజేపీ జిల్లా కార్యదర్శి రా జసింహా, ఎస్సీ మోర్చా ప్రధానకార్యదర్శి ఆం జినేయప్ప, వెంకటేశ్ పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక అంబేడ్కర్ భవనంలో దళిత నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రెడ్డెప్ప, వాసు, జయకృష్ణ, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద పలువురు ప్రజా సంఘనాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, మహమ్మదాలిబేగ్, వెంకటేశ్, ఓబులేశు, నరేష్, జైబాలాజీ, మునీంద్ర, పవన్, చంద్రశేఖర్ ఆచారి, ముజీబ్‌బాష, వెంకట్రమణ పాల్గొన్నారు.

గుడుపల్లె: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాల యంలో వీసీ దొరస్వామి అంబేడ్కర్ చిత్రప టానికి పూజలు చేసి నివాళులర్పించారు. రి జిస్ట్రార్ ఆచార్యకిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాలాజీ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. ఏవో భాస్కర్, రాజశేఖర్, నాగరాజ, సుధాకర్ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి చక్కని వేదిక రెవెన్యూ సదస్సులు

గుడుపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సు లు చక్కని వేదిక అని టీడీపీ గుడుపల్లె మం డల అధ్యక్షుడు బాబునాయుడు తెలిపారు. శుక్రవారం మండల పరిధి అగరంలో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతులు రెవి న్యూ సదస్సుల్లో వినతులు అందించి పరిష్కా రం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో త హసీల్దారు సీతారామ్, టీడీపీ, జనసేన నాయకులు అమీర్, హేమాంబరగౌడు, గోపా ల్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని తహసీల్దార్ జయసింహ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ బంగళా ఆవరణంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు రామ నాథంనాయుడు, నూర్‌బాషా, ఈఎం రత్నం, అనీల్‌కుమార్, అధికారులు, టీడీపీ నాయ కులు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా తిమ్మరాయస్వామి ఆలయ కుంభాభిషేకం



కుప్పం, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): కుప్పం మండలం చిన్న బొగ్గుపల్లెలో శ్రీదేవి, భూదేవి స మేత ప్రసన్న తిమ్మరాయస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్స వం శుక్రవారం వైభవంగా జరి గింది. వేదపండితులు వివిధ ర కాల హోమాలు, పూజలు నిర్వ హించి దేవతామూర్తులకు ప్రా ణప్రతిష్ట చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దేవతా మూర్తులను దర్శించుకున్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, ఏఎంసీ మా జీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గో పినాథ్, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి చెక్కునత్తం మణి, యూనిట్ ఇన్‌చార్జి తదిత రులు కుంభాభిషేక పూజ ల్లో పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భూ సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం విఫలం


ప్రసంగిస్తున్న రామనాథంనాయుడు

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథం నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో శుక్రవారం తహసీల్దార్ జయ సింహ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వ హించారు. 48 మంది తమ సమస్యలు పరిష్కారించాలని దరఖాస్తులు ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. డీటీ దిలీప్‌కుమార్, ఆర్ఐ దొరస్వామి, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, సర్పంచ్ షుకూర్ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: బండకిందపల్లె గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ పాల్గొన్నారు. రైతుల నుంచి అధికారులు వినతులు స్వీక రించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, మాజీ సర్పంచులు ఓబులేశ్వరరెడ్డి, రవికుమార్ నాయుడు, నాయకులు అమరనాథ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కర్ణాటక మద్యం స్వాధీనం ఒకరి అరెస్ట్

గంగవరం, డిసెంబరు6,(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గంగ వరం అర్బన్ సీఐ ప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని గొర్రెల దొడ్డి గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమా చారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయి స్తున్న గోపి (33)ని అరెస్టు చేశారు. అతడి నుంచి 120 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు తరలించారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

చౌడేపల్లె, డిసెంబరు6:(ఆంధ్రజ్యోతి): ఆటో అదుపు తప్పి బోల్తా పడ్డ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు .. మండలంలోని చిట్రెడ్డిపల్లెకు చెందిన కొందరు నిమ్మనపల్లె సమీపంలో కూలి పనులకు ఆటోలో వెళ్లారు. పనులు ముగించుకుని ఆటోలో తిరిగి వస్తుండగా పెద్దకొండామారి సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. రమణ(60) అనే కూలీ కాలు విరిగింది. వెంటనే స్థానికులు 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అంబేడ్కర్‌కు పూజలు

రామకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని శివాజీనగర్-రెడ్డివీధి కూ డలిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఇన్‌చార్జీ ఎ స్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పూజలు నిర్వ హించారు. పక్కనే ఉన్న ఉయ్యాలవాడనర సింహారెడ్డి శిలాఫలకానికి కూడా వారు పూ జలు చేశారు.

సారా ఊట ధ్వంసం

పుంగనూరు రూరల్, డిసెంబరు6(ఆంధ్ర జ్యోతి): మండలంలోని జువ్వలదిన్నె తాండా సమీప పొలాల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పుంగనూరు ఎక్సైజ్ సీఐ సురేశ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది సుబ్రహ్మణ్యంగౌడు, నాగరాజ, సురేంద్రబాబు, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు6(ఆంధ్ర జ్యోతి): పుంగనూరు- పలమనేరు మార్గం లోని తోపుమఠం వద్ద శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని కొత్తపేటకు చెందిన షేక్ అఫ్రోజ్(27) మత గురువుగా పనిచేస్తున్నాడు. సొంత పనులపై పలమ నేరుకు వెళ్లి తిరిగి పుంగనూరు వస్తుండగా పలమనేరు వైపు వెళుతున్న ద్విచక్రవాహ నం ఢీకొనడంతో అఫ్రోజ్ గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భూ సమస్యలు పరిష్కరించండి

శాంతిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు రెవెన్యూ అధికారులను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని చెంగుబల్ల గ్రామంలో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని అధికారులు నిలబెట్టాలని కోరారు. తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ రైతుల సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తామని వివరించారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు సమర్పించారు.

రోడ్డుకు మరమ్మతులు

కుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కు ప్పం మున్సిపాల్టీ 22వ వార్డులో పాడైపోయి న రోడ్డుకు శుక్రవారం మున్సిపల్ కమిషన ర్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టా రు. టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర జిమ్‌దా ము, కౌన్సిలర్లు సురేష్, వేలు, జగన్, నేతలు సోము, శివ పాల్గొన్నారు.

సోమలలో అంబేడ్కర్‌కు నివాళి



సోమల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సోమల బస్టాండ్‌లో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివశంకర్, నాయకులు మురళి, రామనాథం, రవి, ప్రకాశ్, వెంకట్రామయ్య, శుభకర్, చిట్టి, ఆటో శివ, వినాయక, మణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

శాంతిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎంపీపీ పుష్ప, మండల టీడీపీ మహిళ అధ్యక్షురాలు శ్యామల అన్నారు. శుక్రవారం శివరామా పురంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతి రేకంగా గ్రామ మహిళలతో కలిసి అవ గాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో మానవ హారం చేపట్టారు. అమ్మాయిలను, అబ్బాయిలను సమానంగా పెంచాలన్నారు. అనంతరం అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ భాగ్యలక్ష్మి, సంఘమిత్ర, శైలజ, సుధమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కోరారు. మండలంలోని బేలుపల్లెలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవిన్యూపరంగా ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు. ఆన్‌లైన్‌లో తమ భూములు వేరేవారి పేరుపై చూపడమే ఇందుకు నిదర్శనమన్నారు. అందుకే అవకతవకలకు తావులేకుండా రైతులకు న్యాయం చేసేందుకు రెవెన్యూ సదస్సులు చేపట్టామన్నారు. అలాగే అర్హులైన వారందరికీ పక్కా గృహాలు, పింఛన్లు మంజూరు చేస్తామ న్నారు. పలమనేరు రోడ్డు నుంచి బేలు పల్లెకు పెండింగ్‌లో వున్న రోడ్డుపనులను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం అధి కారులు ప్రజల నుంచి 137 వినతిపత్రాలు స్వీకరించారు. పలమనేరు ఆర్డీవో భవాని, తహసీల్దార్ మాధవరాజు, టీడీపీ మండ లాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, కూటమి నాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అభివృద్ధిపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టాలి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సూచన


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ ఆపి అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పుంగనూ రులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాల యంలో రికార్డులు దగ్ధం చేయించారంటూ తనపై విమర్శలు చేశారని, ఏదైనా ఉంటే చర్యలు తీసుకోవాలి తప్ప దుష్ప్రచారం చేయడం తగదని దుయ్యబట్టారు. మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలను ప్రభుత్వం పట్టిం చుకోలేదని ఆరోపించారు. మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మున్సి పల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే దళితసం ఘ నాయకులు, ఎస్‌డీపీఐ నాయకులు, టీడీపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో అశోక్‌కుమార్, శ్రీనివాసులు, వైవీ రమణ, ఎస్‌డీపీఐ నాయకులు చాంద్‌బాషా, అతిక్‌బాషా, అయూబ్, అల్తాఫ్, టీడీపీ నాయ కులు సుహేల్‌బాషా, రామయ్య, మధు, బాషా, ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానులకు భరోసా ఇచ్చేందుకే సదస్సులు


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

రామకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత పాలకుల చేసిన పాపాల వ ల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ యజ మానులకు న్యాయం చేసి, భరోసా ఇచ్చేం దుకే కూటమి ప్రభుత్వం రెవిన్యూ సదస్సు లకు శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ విప్ కం చర్ల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం రామకు ప్పం మండలం గొరివిమాకులపల్లెలో నిర్వ హించిన రెవిన్యూ సదస్సుల్లో కలెక్టరు సుమి త్‌కుమార్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మెన్ మునిర త్నం, కడ పీడీ వికాస్‌మర్మత్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. రెవిన్యూ సదస్సుల్లో రై తులు నుంచి వచ్చే భూసమస్యలను అధికా రులు త్వరగా పరిష్కరిస్తారని ఆయన తెలి పారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఆర్డీఓ శ్రీని వాసరాజు, తహసీల్దారు బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేషబాబు, ఎ స్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయ ణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్య దర్శులు ఆనందరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్ని కృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానా యక్, క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గంట్లప్పగౌడు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, డిసెంబరు6:(ఆంధ్రజ్యోతి): ప్ర ముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహు కాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి రాహుకాలంలో పంచామృతాభిషేకాలు నిర్వ హించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంక రించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పా ల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

హెచ్ఎం మృతి ఘటనలో దోషులను శిక్షించాలి



పలమనేరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్ఎం మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఇక్కడి ఫ్యాప్టో నాయకులు శుక్రవారం ఎంఈఓలు లీలారాణి, బాలసుందరంలకు వినతిపత్రం అందజేశారు. హెచ్ఎం కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ మునాఫ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్ధంతి జరపలేదని నిరసన



శాంతిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శాంతిపురం తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని అధికారులు జరపలేదని మండల దళిత నేతలు కార్యాలయం ఎదుట బైఠాయించి నరసన తెలిపారు. అయితే చెంగుబల్ల గ్రామంలో రెవెన్యూ సదస్సులో ఉండడంతో సిబ్బంది ద్వారా వర్ధంతిని చేపడుతామని తహసీల్దార్ శివయ్య తెలియజేశారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్‌లు కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. దీంతో వారు నిరసన విరమించారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

గంగవరం, డిసెంబరు6,(ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని గంగవరం తహసీల్దార్ శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గంగవరం మండలం కీలపట్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 39 అర్జీలు వచ్చాయి. సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల జోరు

సోమల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచా యతీలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికసంఖ్యలో పొలాల వద్దకు దారిసమస్యలే అందాయని తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. ఎస్సీలకు శ్మశాన వాటికలకు స్థలం చూపాలని వినతిపత్రాలు అదించారని వివరించారు. మాజీ సర్పంచు సుధాకర్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయుడు, ఆర్ఐ సుబుక్తుల్లా పాల్గొన్నారు.

గోనుమాకులపల్లె సదస్సుకు 25 వినతులు

వి.కోట, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): రెవిన్యూ సదస్సులను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని చిత్తూరు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం వి.కోట మండలం గోనుమాకులపల్లె పంచాయతీ కేంద్రంలో జరిగిన రెవిన్యూ సదస్సుకు 25 వినతులు అందాయి. ముఖ్యంగా నాగిరెడ్డి పల్లెలో శ్మశానాన్ని ఆక్రమించారని సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దారి సమస్యలు అధికంగా వస్తున్నాయని రైతులు ఎవరికి వారు దారి విడుచుకుంటే అందరికీ సౌక ర్యంగా ఉంటుందని ఆర్డీవో భవాని తెలి పారు. తహసీల్దార్ పార్వతి పాల్గొన్నారు.

డీఎన్‌కే కాంక్రీట్ ప్లాంట్ ప్రారంభం



వి.కోట, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): వి.కోట మండలం గంధారమాకులపల్లె సమీపంలో మండల టీడీపీ బీసీ సెల్ విభాగ అధ్యక్షులు డీఎన్ కుమార్ కుటుంబీకులు ఏర్పాటు చేసిన డీఎన్‌కే పవర్‌కాన్ మిక్స్‌డ్ కాంక్రీట్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.5 కోట్ల వ్యయంతో ఈ కాంక్రీట్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా నాణ్యతతో కూడిన కాంక్రీట్ రెడీ మిక్స్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ ముని రత్నం, టీడీపీ నాయకులు డా. సురేష్‌బాబు, రామచంద్రనాయుడు, సత్యేంద్రశేఖర్, రంగ నాథ్, డా.వెంకటేష్, రాంబాబు, చంద్రారెడ్డి, రత్నప్ప, సోము, ధీరజ్, శబరీష్, నాగరాజు, ఈశ్వర్, హరినాథరెడ్డి, సతీష్, విశ్వనాథ్, నాసీర్, కేశవులు, గోపీనాథ్, దామోదర్, జనార్ధన్‌రెడ్డి, ఇక్బాల్, రబ్బానీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఉదయలక్ష్మి తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీచేశారు. పాఠశాల విద్యార్థుల ప్రోగ్రెస్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేరెంట్ టీచర్స్ సమావేశం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులు అభ్యసించాలని, నాణ్యమైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాము


చౌడేపల్లె, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీటీ మాధవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఏకొత్తకోట పంచాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మొత్తం 18 వినతి పత్రాలు అందినట్లు ఆమె తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ గుణ, ఆర్ఐ భారతి, దేవదాయశాఖ అధికారి సురేంద్ర, వీఆర్వోలు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: రెవెన్యూ సదస్సు లను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని పుంగనూరు తహసీల్దార్ జె.రాము తెలిపారు. చంద్రమాకులపల్లె స్కూల్ సమీ పంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 54 మంది అర్జీలు సమర్పించారు. పుంగనూరు రూరల్ టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాతకక్షలతో మహిళపై దాడి

పుంగనూరు రూరల్, డిసెంబరు6(ఆంధ్ర జ్యోతి): పాత కక్షలతో మహిళపై దాడి చేసి గాయపరిచిన ఘటన గురువారం సాయం త్రం చోటుచేసుకుంది. పుంగనూరు మండలం లోని బోడేవారిపల్లె పంచాయతీ యాతలవం కకు చెందిన విజయ్, ప్రశాంత్, రెడ్డిప్రసాద్, చెన్నకేశవులు, చంద్ర, జగదీష్, ఆశ, కన్నయ్య లకు అదే గ్రామానికి చెందిన రజక కులస్థులై న పార్వతమ్మ, నరేశ్‌లకు పాత కక్షలు ఉన్నాయి. తన కుమారుడు నరేశ్‌పై దాడి చేస్తుండగా అడ్డుగా వెళ్లిన పార్వతమ్మపై దాడిచేసి గాయపరిచారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. విషయం తెలు సుకున్న రజక సంఘ నాయకులు నాగరాజ, నాగయ్య, విజయకుమారి ఆమెను పరామ ర్శించారు.

తెగిన బండకుంట కట్ట


కట్ట తెగడంతో వరి పొలాల్లో ప్రవహిస్తున్న నీరు

సోమల, డిసెంబరు 6(ఇంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట పంచాయితీ పార్వతీపురం సమీపంలోని బండకుంట కట్ట శుక్రవారం తెగిపోయింది. నీరంతా పొలాలపై ప్రవహించడంతో కోత దశలోని వరి దెబ్బతింది. వరి పైర్లు నేల వాలాయి. ఆ నీళ్లు దిగువన ఉన్న సాకిరేవు కుంటకు చేరుకున్నాయి. అక్కడి కుంట మొరవ పోయి తిరుపతి- పుంగనూరు ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహించి ద్విచక్రవాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సోమల పోలీసులు, ఇరికిపెంట మాజీ సర్పంచు శ్రీనివాసులు నాయుడు చొరవ తీసుకుని రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. వరి పంట నష్టం జరిగిన రైతులు తమకు ఆర్థిక సాయం అందజేయాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మండలస్థాయి అధికారులు తెగిన కుంటను పరిశీలించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నగరి కోర్టులో రాజ్యాంగ నిర్మాతకు నివాళి


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసిన మెజిస్ట్రేట్ విష్ణువర్మ తదితరులు

నగరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరి కోర్టు ఆవరణలో మెజిస్ట్రేట్ విష్ణువర్మ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో దళిత్ పీపుల్ ఫ్రంట్ నేత గజేంద్రన్ మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం సమీపాన రెండు మద్యం దుకాణాలున్నాయని, వాటిని తొలగించాలని గత నెల 26న ఎక్సైజ్ సీఐకి అర్జీ ఇచ్చినా పట్టించుకోలేదని విమర్శించారు. ఎస్ఆర్‌పురం మండలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ సంఘం నాయకులు విజయ్‌కుమార్, ఉమాపతి, తంగరాజు, గోవిందస్వామి, రామచంద్రన్, మహేష్, హరి, తులసీరామ్, కోర్టులో రామశాంతి, జగదీష్, బాబు, అరుళ్, మురళీధర్, చిరంజీవులు, మహదేవన్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం
రెవెన్యూ సదస్సుల్లో అధికారులు

భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం పలు మండలాల్లో సదస్సులు జరిగాయి. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.

శ్రీరంగరాజపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలవాయి, జీఎంఆర్‌పురంలలో జరిగిన సదస్సులో 56అర్జీలు అందాయని తహసీల్దార్ లోకనాథం పిళ్ళై తెలిపారు. డీటీ రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: పన్నూరులో జరిగిన సదస్సులో తహసీల్దార్ కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తవణంపల్లె: గోవిందరెడ్డిపల్లెలో జరిగిన సదస్సులో పది అర్జీలు అందాయని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. సర్పంచ్ సురేష్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: కొట్రకోనలో జరిగిన సదస్సులో 25అర్జీలు అందాయని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాల: గుండ్లపల్లెలో జరిగిన సదస్సుకు 40 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. వేదగిరివారిపల్లె సర్పంచ్ రాజేంద్ర, నాయకులు రుష్యేంద్రనాయుడు, శివకుమార్, గంగినాయుడు, కిషోర్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మొండివెంగనపల్లె, ఎట్టేరంగనిపల్లెలో జరిగిన సదస్సుల్లో 58 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రమేష్ బాబు తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగయ్య, నాయకులు బండి లోకేష్ రెడ్డి, కొర్లగుంట భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ● కార్వేటినగరం మండలం సురేంద్రనగరంలో జరిగిన సదస్సులో నాలుగు వినతులు వచ్చాయని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్లు త్యాగరాజు, స్వరూపరాణి, సుబ్రహ్మణ్యంస్వామి పాల్గొన్నారు.

నిండ్ర: మండల కేంద్రంలో జరిగిన సదస్సులో 12 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ శేషగిరిరావు తెలిపారు. సర్పంచ్ వసంతమ్మ, టీడీపీ నేతలలు భాస్కర్,విజయ్‌కుమార్,పెరుమాల్ పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని గుంటిపల్లె సచివాలయంవద్ద జరిగినసదస్సులో 29అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ హేమలత, డీటీవాణి పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని ఎర్రచెరువుపల్లెలో జరిగిన సదస్సులో తహసీల్దార్ గుర్రప్ప, డీటీలు మహేశ్వరి, మునికృష్ణ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని మహాసముద్రం గ్రామ సచివాలయం వద్ద జరిగిన సదస్సులో 66 అర్జీలు అందాయని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సదస్సులో సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


అనిల్ కుమార్‌ను సత్కరిస్తున్న జేడీ ప్రభాకర్ తదితరులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు చేసిన సేవలకు గుర్తింపుగా వి.అనిల్ కుమార్‌కు జాతీయ స్థాయిలో గోపాలరత్న అవార్డు లభించడం గర్వకారణమని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ కొనియాడారు. ఈయన ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లె డివిజన్ వేంపల్లె గ్రామీణ పశువైద్య శాల జూనియర్ వెటర్నరీ అధికారిగా పనిచేస్తున్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జేడీ కార్యాలయంలో అనిల్ కుమార్‌ను శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు శశిధర్, తులసి, జిల్లా ఎన్జీవో హోం ప్రెసిడెంట్ రాఘవ, లోకనాథం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న జయప్రకాష్

జయప్రకాష్‌కు పలువురి శుభాకాంక్షలు

బంగారుపాళ్యం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ జన్మదిన వేడుకలను శుక్రవారం తన అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నలగాంపల్లె కొండపై వెలిసిన శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మొగిలిలో ఉన్న కామాక్షి సమేత మొగిలీశ్వరుడి ఆలయంలో పూజలు చేశారు. శేషాపురం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం భారీ ర్యాలీగా మండల పార్టీ ఆఫీసుకు చేరుకుని అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే మురళీ మోహన్‌తో కలిసి కట్‌చేశారు. వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంవద్ద పేదలకు అన్నదానం చేశారు. పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జయచంద్ర నాయుడు, ధరణీ, విక్రమ్, జనార్దన్ గౌడ్, కలమనాథరెడ్డి, హేమచంద్రనాయుడు, రమేష్, రాధాకృష్ణ నాయుడు, కోకా ప్రకాష్‌నాయుడు, హరి ప్రసాద్, సురేంద్రనాయుడు, లోకనాథనాయుడు, మంజునాథ్, నవీన్‌చౌదరి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయండి: ఎస్ఈ

చిత్తూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాత కలెక్టరేట్‌లో చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయం మరమ్మతులను త్వరగా పూర్తిచేయాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. శుక్రవారం పనులను పరిశీలించారు. ఈఈలు సురేష్, జగదీష్, ఏఈ భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

దారి లేకుండా గోతిని తీసేశాడు!


దారిని తవ్వేసిన చోట అగ్గిచేనుపల్లె గ్రామస్తులు

వెదురుకుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అగ్గిచేనుపల్లె గ్రామ పంచాయతీ పొదలకుంట గ్రామానికి వెళ్లే దారిని ఓ వ్యక్తి ఎక్స్‌కవేటర్‌తో గోతిని తవ్వేశాడని అగ్గిచేనుపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి వర్గీయులు ఆరోపించారు. గ్రామంలో నెలకొని ఉన్న గొడవల కారణంగా రోడ్డును ఇలా తవ్వేసి ఇబ్బంది పెడుతున్నాడని చెప్పారు. ఈ విషయమై రెవెన్యూ వారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అగ్గిచేనుపల్లె, పొదలకుంట గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

పాలసముద్రం ఎస్ఐగా చిన్నరెడ్డెప్ప



పాలసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):పాలసముద్రం ఎస్ఐగా జి.చిన్నరెడ్డెప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి పీటీసీనుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన భారతి బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లారు. నూతన ఎస్ఐని ఏఎస్ఐ రవి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నేతలు అరుళ్ నాథన్, సాంబశివన్, రాఘవన్ సన్మానించారు.


మెట్లపై పిచ్చిమొక్కలు


పుష్కరిణిలో చెత్తాచెదారం



పేరుకుపోయిన చెత్తాచెదారం

స్కంధ పుష్కరిణిని పట్టించుకోరా?

కార్వేటినగరంలో ఉన్న స్కంధ పుష్కరిణి దక్షిణ భారతదేశంలో అత్యంత పెద్దది. కార్వేటినగరం సంస్థానాధీశుల కాలంలో 14.5 ఎకరాల్లో నిర్మితమైంది. వాస్తు, శిల్పకళకు ప్రతీకగా నిలిచింది. ఇటీవల ఈ స్కంధ పుష్కరిణిని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో విలీనం కూడా చేశారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ పుష్కరిణిలో ప్రస్తుతం చెత్తాచెదారం పేరుకుపోయింది. మెట్లపై మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ఇకనైనా పుష్కరిణిలో చెత్తాచెదారం, మెట్లపై పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి

45 రోజుల్లోనే సమస్యల పరిష్కారానికి చర్యలు : జేసీ


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి →

యాదమరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జేసీ విద్యాధరి తెలిపారు. మండలంలోని కుక్కలపల్లె గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ.. సదస్సుల్లో వచ్చే అర్జీలకు 45 రోజుల్లో పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మొత్తం 32 అర్జీలు అందజేశారని తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ తులసీధర్, వీఆర్వోలు సురేష్, వేలాయుధం, సర్పంచ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నేతల తీరుపై టీడీపీ ఆగ్రహం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో జీర్ణించుకోలేని వైసీపీ నేతల తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాట్లాడుతున్నారని పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం ఆగ్రహం వ్యక్తం చేశారు. వరత్తూరులో శుక్రవారం 212మందికి టీడీపీ సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు బుర్రా జ్యోతియాదవ్, యువనేత సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటస్థలం ఆక్రమణపై తహసీల్దార్ పరిశీలన


ఆటస్థలాన్ని పరిశీలించడానికి వెళుతున్న రవికుమార్ తదితరులు

నగరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాంగాడు పంచాయతీలో తహసీల్దారు రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామంలోని ఆటస్థలాన్ని కొందరు ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకుంటున్నారని అడ్డుకోవాలని స్థానిక యువత విన్నవించింది. స్పందించిన తహసీల్దార్ ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. సదస్సుకు 17 అర్జీలు అందాయని తెలిపారు. ఎంపీడీవో సతీష్, సర్పంచ్ ఆనంద్, టీడీపీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేష్ నాయుడు, గోపాల్‌శెట్టి, నారాయణ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి భరోసా



బంగారుపాళ్యం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గత నెలలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త, ఎలక్ట్రీషియన్ జానకిరామ్ శెట్టి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే మురళీమోహన్ భరోసా ఇచ్చారు. శుక్రవారం నలగాంపల్లెలోని మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో తన భర్త జానకిరామ్ ఉన్న ఫొటోను చూపుతూ గాయత్రి విలపించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జయప్రకాష్, జయచంద్ర నాయుడు, ధరణి, విక్రమ్, జనార్దన్ గౌడ్, నాగరాజ్ గౌడ్, చిన్నయ్య, లోకేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి : ఎమ్మెల్యే

బంగారుపాళ్యం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):కూటమిప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం నలగాంపల్లెలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును మండలాధ్యక్షుడు జయప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, మాజీ ఎంపీపీ సుచిత్ర, సర్పంచ్ సీబా స్వామిదాస్, ఎంపీటీసీ ప్రసన్న కుమారి, నాయకులు ధరణి, విక్రమ్, జనార్దన్ గౌడ్, నాగరాజ్ గౌడ్, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు: ఆర్డీవో


సదస్సులో పాల్గొన్న ఆర్డీవో శ్రీనివాసులు

గుడిపాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని నారగల్లు పంచాయతీలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. డీటీలు లక్ష్మి, రూపాదేవి, ఆర్ఐ రామసాయి, సర్వేయర్లు గోపినాథ్, కిరణ్, కోటి, వైస్ ఎంపీపీ జయప్రియ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు వ్యాపారులు సహకరించాలి
● పరిశ్రమల శాఖ డీఐవో శ్రీనివాస్‌యాదవ్



చిత్తూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):ఎంఎస్ఎంఈ(సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల) నమోదు కోసం చేస్తున్న సర్వేకు వ్యాపారులు సహకరించాలని పరిశ్రమలశాఖ డీఐవో శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పరిశ్రమల కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఉత్పత్తి, సేవ, ట్రేడ్, చిరువ్యాపారులు స్థానిక సచివాలయాల్లో వారి వ్యాపార వివరాలను ఫిబ్రవరి 1వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సర్వేతో క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఆ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 3,255 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని వివరించారు.

సీఆర్ రాజన్‌కి సన్మానం



పెనుమూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌ను విజయవాడలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, టీడీపీ మండలాధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, పార్లమెంట్ కార్యదర్శి రెడ్డెప్ప, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, ప్రధానకార్యదర్శి భాస్కర్, మాజీ సర్పంచ్ రాజగోపాల్‌నాయుడితోపాటు గంగాధరనెల్లూరు నియోజకవర్గం నుంచి 200మంది టీడీపీ, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అన్నీ అక్రమాలే: టీడీపీ

గుడిపాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అన్నీ అక్రమాలే జరిగాయని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ అధికారం చేపట్టినప్పటినుంచి ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. వైసీపీ నాయకుల కోసం భూకబ్జాలు చేసి.. చివరకు రేషన్ బియ్యాన్ని కూడా షిప్ ద్వారా ఎగుమతి చేయడం నీచ రాజకీయమన్నారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్/రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని పలువురు వక్తలు తెలిపారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు శుక్రవారం పూలమాలలు వేసి, ఘన నివాళి అర్పించారు. ● చిత్తూరు దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు అధికారులు పుష్పాంజలి ఘటించారు. వీరిలో.. సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి, మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, దళిత సంఘాల నేతలు మునస్వామి, వరదరాజులు, రాజ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, తదితరులున్నారు. ● నగరపాలక కార్యాలయంలోనూ మేయర్, తదితరులు అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ● గాంధీరోడ్డులోని విద్యుత్ అర్బన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర, డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి, ఏఈలు పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ: నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజ, క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి సురేష్, ఆనగల్లు సర్పంచ్ కరుణాకర్, చిత్తూరు మండల ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: తెల్లగుండ్లపల్లెలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, సాయి, మునస్వామి, వెంకటయ్య, దయాకృష్ణ, చంద్రబాబు, పుల్లయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు. ● వెదురుకుప్పంలో జరిగిన కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళి, శ్రీనాథరెడ్డి, మునెయ్య, వరప్రసాద్ పాల్గొన్నారు. ● కార్వేటినగరంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత తలారి మునికృష్ణ, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కె.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ సుమన్, టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు గుండయ్య, దాము, చందు, నిరంజన్‌రెడ్డి, మణి పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించిన సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది

పూతలపట్టు: పూతలపట్టు-రంగంపేట క్రాస్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ దేవిక, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

విజయపురం: పన్నూరు, మహారాజపురంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సెల్వం, కన్వీనర్ పార్థసారథి, మైకేల్ పాల్గొన్నారు.

తవణంపల్లె: ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో దళిత యువజన సేవా సంఘం నాయకులు జగన్నాథం, మురగయ్య, మధు పాల్గొన్నారు.

నిండ్ర: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రమేష్, కోటేశ్వరరావు, ప్రసన్న కుమార్, దేవ, జగన్, ధర్మపుత్ర, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అంబేడ్కర్ సేవలు ఎనలేనివి
● ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్



వెదురుకుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ సేవలు ఎనలేనివని ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం శనివారం జరుగుతుందని మేయర్ అముద తెలిపారు. కౌన్సిల్ సమావేశపు మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

శివపార్వతుల కల్యాణోత్సవం



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంతపేట చవటపల్లెలోని కనకదుర్గాలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. అలాగే భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులకు భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

శ్రీరంగరాజపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్‌గా బాధ్యత తీసుకున్నా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఎస్ఆర్‌పురం మండలంలో శనివారం తొలిసారిగా పర్యటించనున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఆయన్ను సన్మానించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే తల్లిదండ్రుల సమావేశానికి కూడా థామస్ హాజరవుతారని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిర్మూలిద్దామని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, సీడీపీవో వినతశ్రీ, ఎంఈవో ఆంజినేయులుశెట్టి పిలుపునిచ్చారు. ఎంపీడీవో మీటింగ్ హాలులో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం జరిగింది. యోగా మాస్టర్ గోపీకృష్ణ, పీహెచ్‌సీల డాక్టర్లు దుర్గాదేవి,దివ్య, వేల్కూరు క్రాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు భూపతి, రూరల్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిట్టిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి సమావేశానికి రండి
విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించిన టీచర్లు



విజయపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు శనివారం తప్పకుండా హాజరు కావాలని విద్యార్థుల తల్లిదండ్రులను శుక్రవారం శ్రీహరిపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జ్ఞానప్రసాద్ కలిసి ఆహ్వానించారు. పూర్వ విద్యార్థులను, ప్రజాప్రతినిధులను, విద్యావేత్తలను, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కూడా పిలిచినట్లు తెలిపారు.